ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 37.0
కనిష్ఠం 25.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
శుక్రవారం 21 జూన్ 2024

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.40 (122.3596)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.60 (2.69)	197	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	నిల్

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు లైవ్: రూ.168 డ్రెస్: రూ.260 స్కిన్‌లెస్: రూ.290



భువనగిరిలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎరువులపై నిఘా

- ప్రత్యేక బృందాల ముమ్మర తనిఖీలు
- రూ.22లక్షల విలువైన వరి విత్తనాలు విక్రయించకూడదని నోటీసులు


యాదాద్రి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలం పంటల సాగు ముమ్మరమైంది. రైతులు ఇప్పటికే దుక్కులు, వరి నారుమడులు సిద్ధం చేసుకోగా, పలు ప్రాంతాల్లో పత్తితో పాటు ఆరుతడి పంటల విత్తనాలు విత్తారు. భారీ వర్షాలు కురవగానే ముమ్మరంగా విత్తనాలు విత్తేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో వానాకాలం సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, ఎరువుల విక్రయాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. మరో వారం రోజుల్లో ఎరువుల విక్రయాలు ఊపందుకోనున్నాయి.

రైతులకు ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంది. జిల్లావ్యాప్తంగా ఎరువుల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేసింది. ఎరువులు అధిక ధరలకు విక్రయించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసింది. ఈ బృందాలు జిల్లావ్యాప్తంగా ఎరువుల ధరలను తనిఖీచేసి ఎమ్మార్పీకే రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాయి. అదేవిధంగా జిల్లాలో రాష్ట్రస్థాయి తనిఖీ బృందాలు(స్క్వాడ్) కూడా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ బృందంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ఉన్నారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.22లక్షల విలువైన వరి విత్తనాలను విక్రయించకూడదని వ్యవసాయశాఖ అధికారులు డీలర్లకు నోటీసులు జారీచేశారు. ఇప్పటివరకు 220 అవుట్‌లెట్స్‌కు 188 దుకాణాల్లో తనిఖీలు జరిగాయి. డీలర్ల వద్ద ఉన్న పాత స్టాక్ వివరాలు సేకరించడంతోపాటు, పాత ధరకే రైతులకు విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డీలర్ల వద్ద మిగిలిన ఎరువులను కొత్త ధరలకు విక్రయించవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం తొమ్మిది బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అదేవిధంగా కృత్రిమ ఎరువుల కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. డీలర్ల వద్ద స్టాక్ ఉన్నంత వరకు ఎరువులను విక్రయించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులను కొనుగోలుచేయాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అందుబాటులో ఎరువులు

జిల్లాలో మొత్తం 4.28లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా. 1.35లక్షల ఎకరాల్లో పత్తి, 2.85లక్షల ఎకరాల్లో వరి, ఇతర పప్పుధాన్యాలు, నూనెగింజలు సాగవనున్నాయి. ప్రస్తుత సీజన్‌లో 80,594 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ప్రస్తుతం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం అధికంగా ఉంటుంది. ఆగస్టులో యూరియాతో పాటు మరికొన్ని కాంప్లెక్స్ ఎరువులను రైతులు వినియోగిస్తారు. జిల్లాలో యూరియా 35,260మెట్రిక్ టన్నులు, డీఏపీ 14,530, ఎంవోపీ 5,812, కాంప్లెక్స్ 23,248, ఎస్ఎస్‌పీ 1,744 మెట్రిక్ టన్నులు అవసరం. కాగా, యూరియా 13,181 మెట్రిక్ టన్నులు, డీఏపీ 511.29, ఎంవోపీ 361.40, కాంప్లెక్స్ 177.60, ఎస్ఎస్‌పీ 3048.22 మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా పత్తి విత్తనాలు 2,70,000 ప్యాకెట్లు, వరి 71,012, పప్పు ధాన్యాలు 208, నూనెగింజలు 63.48 టన్నుల వరకు అవసరం. ఈ మేరకు విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు



వానాకాలంలో రైతులు 4.28లక్షల ఎకరాలు వరకు సాగుచేయనున్నట్లు అంచనా వేశాం. విత్తనాలు, ఎరువులు రైతులకు ఎమ్మార్పీకే విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటుచేశాం. అన్ని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ వివరాలు సేకరిస్తున్నారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎఫ్‌సీవో 85 చట్టం ప్రకారం కల్తీ విత్తనాలు విక్రయించవద్దని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృత్రిమ ఎరువులు, విత్తనాల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

● కె.అనురాధ, జిల్లా వ్యవసాయాధికారి



మద్దతు తక్కువే

- పంటల మద్దతు ధరలను ప్రకటించిన కేంద్రం
- గత ఏడాదితో పోల్చితే పెంపు తక్కువే
- వరికి రూ.117, పత్తికి రూ.501
- కందికి రూ.550, నువ్వులకు రూ.632 పెంపు

మోత్కూరు, జూన్ 20: కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించింది. ఏటా సాగు ఖర్చు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర పెంపు గత ఏడాదితో పోల్చితే ఈ సారి తగ్గింది. సాగు వ్యయం మాత్రం గత ఏడాదితో పోల్చితే పెరిగింది. గత ఏడాది వరికి రూ.143, పత్తికి రూ.540, కందికి రూ.400, నువ్వులకు రూ.805, పెసర రూ.803పై మద్దతు ధర పెంచగా, ఈ ఏడాది వరికి రూ.117, పత్తికి రూ.501, కందికి రూ.550, నువ్వులకు రూ.632, పెసరకు రూ.124 మాత్రమే పెంచారు. గత ఏడాది కంటే ఈ సారి కంది, రాగులు, పొద్దుతిరుగుడుకు కొంత ఎక్కువగా పెరిగింది. సన్న రకాల వరి ధాన్యానికి మాత్రం కేంద్రం మద్దతు ధర ప్రకటించలేదు.

ఎక్కువ సాగయ్యే పంటలపై తక్కువ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి, పత్తి అధికంగా సాగవుతోంది. కంది, వేరుశనగ, తదితర పంటలు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. నువ్వులు, పెసర, పొద్దుతిరుగుడు, మినుములు లాంటి పంటలు నామమాత్రంగా సాగవుతాయి. ఎక్కువగా సాగు చేసే పంటలకు మద్దతు ధర తక్కువగా పెంచి, నామమాత్రంగా సాగయ్యే పంటలకు కొంత ఎక్కువగా పెంచడంతో పెద్దగా లాభం ఉండదని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన సాగు వ్యయం

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సాగు వ్యయం బాగా పెరిగింది. విత్తనాలు, ట్రాక్టర్ దున్నకం, ఫ్లౌ, కూలీల రేట్లు బాగా పెరిగాయి. వ్యవసాయ పంపుసెట్లు, ట్రాక్టర్ లాంటి వ్యవసాయ యంత్రాల ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. ఇలా సాగు ఖర్చు పెరగడంతో కేంద్ర ప్రభుత్వం పెంచే మద్దతు ధరలు పెట్టుబడి ఖర్చుల పెరుగుదలతో సరిపోలడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

సాగు వ్యయాన్ని తక్కువగా చూపుతున్న ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం ఏటా పంటల మద్దతు ధరలు పెంచుతున్నా, పంటల సాగు వ్యయం అంతకంటే ఎక్కువ పెరుగుతోంది. పంట సాగు వ్యయానికి 50శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని గతంలో స్వామినాథన్ కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కాగా, కేంద్రం ప్రభుత్వం వాస్తవ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా సాగు ఖర్చును తక్కువగా చూపి దానికి 50శాతం కలిపి మద్దతు ధర ప్రకటిస్తోందని పలువురు నిపుణులు విమర్శిస్తున్నారు.


గిట్టుబాటు కాని మద్దతు ధరలు

పత్తి సాగుకు ఎకరాకు సుమారు రూ.45వేల ఖర్చు వస్తోంది. ఎకరాకు ఆరు నుంచి ఏడు క్వింటాళ్ల పత్తి కంటే ఎక్కువ దిగుబడి రావడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్ల పత్తి దిగుబడిని తీసుకుంటే క్వింటాకు రూ.7,521 చొప్పున రూ.52,647 వస్తాయి. అందులోంచి రూ.45వేలు పెట్టుబడి తీయగా రైతుకు మిగిలేది రూ.7,647. పత్తి ట్రాన్స్‌పోర్ట్‌కు క్వింటాలకు రూ.500 ఖర్చు వస్తోంది. సొంతంగా సాగు చేసుకునే రైతు అయితేనే ఈ మిగులుబాటు. అదే కౌలు రైతు అయితే అది కూడా మిగలదు. వరి సాగుకు ఎకరాకు సుమారు రూ.27వేలు ఖర్చవుతుంది. ఎకరాకు సగటున 23 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ప్రభుత్వానికి విక్రయించాలంటే మార్కెట్‌కు తరలించి ఆరబెట్టి, తూర్పార పడితే సుమారు మూడు క్వింటాళ్ల తరుగు వస్తుంది. ఇక 20 క్వింటాళ్లకు రూ.46,000 వస్తాయి. అంటే ఎకరాకు రూ.9వేలు మిగులుతాయి. అది కూడా సొంతంగా సాగుచేస్తేనే. ఎకరాకు రూ.10వేలు కౌలు ఉంది. ప్రైవేట్ వ్యాపారులు క్వింటాకు రూ.1,900 చెల్లిస్తున్నారు. దీంతో రైతుకు మిగులుబాటు ఉండటం లేదు.

పంటల మద్దతు మద్దతు ధర పెంపు ఇలా...

పంటరకం	2022లో	2023లో	పెంపు	2024లో	పెంపు
వరి (సాధారణం)	రూ.2,040	రూ.2,183	రూ.143	రూ.2,300	రూ.117
వరి (ఏ-గ్రేడ్)	రూ.2,060	రూ.2,203	రూ.143	రూ.2,320	రూ.117
పత్తి (మధ్యస్థ పింజ)	రూ.6,080	రూ.6,620	రూ.540	రూ.7,121	రూ.501
పత్తి (పొడువు పింజ)	రూ.6,380	రూ.7,020	రూ.640	రూ.7,521	రూ.501
కంది	రూ.6,600	రూ.7,000	రూ.400	రూ.7,550	రూ.550
పెసర	రూ.7,755	రూ.8,558	రూ.803	రూ.8,682	రూ.124
మినుములు	రూ.6,600	రూ.6,950	రూ.350	రూ.7,400	రూ.450
జొన్న (హైబ్రీడ్)	రూ.2,970	రూ.3,180	రూ.210	రూ.3,371	రూ.191
జొన్న (మాల్దండి)	రూ.2,990	రూ.3,225	రూ.235	రూ.3,421	రూ.196
సజ్జ	రూ.2,350	రూ.2,500	రూ.150	రూ.2,625	రూ.125
రాగులు	రూ.3,578	రూ.3,846	రూ.268	రూ.4,290	రూ.444
మొక్కజొన్న	రూ.1,962	రూ.2,090	రూ.128	రూ.2,225	రూ.135
వేరుశనగ	రూ.5,850	రూ.6,377	రూ.527	రూ.6,783	రూ.406
పొద్దుతిరుగుడు	రూ.6,400	రూ.6,760	రూ.360	రూ.7,280	రూ.520
సోయాబీన్	రూ.4,300	రూ.4,600	రూ.300	రూ.4,892	రూ.292
నువ్వులు	రూ.7,830	రూ.8,635	రూ.805	రూ.9,267	రూ.632

వరి, పత్తికి ఇంకా పెంచాలి



కేంద్ర ప్రభుత్వం పంటల మద్దతు ధర కొంత పెంచినా, అది గిట్టుబాటు కాదు. ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్న తీరున ప్రభుత్వం మద్దతు ధర పెంచడం లేదు. వరికి క్వింటాకు కనీసం రూ.2600, పత్తికి రూ.9000 మద్దతు ధరగా నిర్ణయించాలి. అప్పుడే రైతుకు గిట్టుబాటు అవుతుంది. పంటల మద్దతు ధర ప్రకటించే ముందు ప్రభుత్వాలు రైతులతో గానీ, రైతు సంఘాల ప్రతినిధులతో గానీ చర్చించాలి.

● మర్రి మధు, రైతు, మోత్కూరు

నెల రోజుల ముందునుంచే 'రుణమాఫీ'

● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



కొరటికల్‌లో శంభులింగేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న విప్ అయిలయ్య

ఆత్మకూరు(ఎం) జూన్ 20: ఆగస్టు 15 నాటికి రైతులకు రూ.2లక్షలు రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన తేదీ కంటే ముందుగానే అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గురువారం ఆత్మకూరు(ఎం) మండలం కొరటికల్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశంభులింగేశ్వరస్వామి దేవాలయంలో గడప పూజలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రైతు రుణమాఫీకి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జూలై 15 నాటికి మొదటి విడత, 20నాటికి రెండో విడత, 30నాటికి పూర్తిగా రైతుల రుణమాఫీ అమలు చేయనున్నట్లు తెలిపారు. రుణ మాఫీపై రైతులకు ఎలాంటి అనుమానాలుగాని ,ఆందోళన గాని అవసరం లేదన్నారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500ను జూలైలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించి బలోపేతం చేయాన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, జడ్పీటీసీ కే. నరేందర్‌గుప్తా, జె.శేఖర్‌రెడ్డి, ఎంపీడీవో నిరంజన్, ఎంపీటీసీలు బండ హంసమ్మ, ఎం.వెంకటేశ్వర్లు, విద్యుత్ డీఈ డి.మల్లికార్జున్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ ఎం.సురేష్ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ప్రవేశాలు పెంచాలి

● జడ్పీస్థాయీ సంఘం సమావేశంలో చైర్మన్ తోటకూరి అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న తోటకూరి అనురాధ

భువనగిరి రూరల్, జూన్ 20: వసతి గృహాల్లో ప్రవేశాల సంఖ్య పెంచి పేద విద్యార్థులకు ప్రయోజనాలను చేకూర్చాలని ఆరో స్థాయీ సంఘం చైర్‌పర్సన్ తోటకూరి అనురాధ అన్నారు. గురువారం జడ్పీ కార్యాలయంలో ఆరో (సాంఘిక సంక్షేమ) స్థాయీ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. పేద విద్యార్థుల భవిష్యత్‌కోసం ప్రభుత్వం అన్ని వసతులతో సంక్షేమ వసతి గృహాలను నిర్వహిస్తోందని, ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని అధికారులకు సూచించారు. వర్షాకాలానికి ముందే వసతి గృహాల్లో మరమ్మతులు చేపట్టాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజన వసతి కల్పించాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, డిప్యూటీ సీఈవో డి.విష్ణువర్ధన్‌రెడ్డి, బీసీ, ఎస్సీ, సంక్షేమ శాఖ జిల్లా అధికారులు యాదయ్య, శ్యాంసుందర్, జైపాల్‌రెడ్డి, పీడీ కృష్ణవేణి పాల్గొన్నారు.

చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

అడ్డగూడూరు, జూన్ 20: పిల్లల్లో నులిపురుగుల నివారణకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని డీఎంహెచ్‌వో పాపారావు అన్నారు. గురువారం అడ్డగూడూరు మండలంలోని మంగమ్మగూడెం గురుకుల పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల శారీరక ధృఢత్వాన్ని అడ్డుకునే నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు దోహద పడుతాయన్నారు. రక్త హీనత పరీక్షలకు రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో యశోద, సుమన్ కల్యాణ్, మధుసుధన్‌రెడ్డి, ప్రవీణ్ కూమార్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

● జిల్లాలో 532 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పనులు ● ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి ● కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జూన్ 20: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో అమ్మఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన కనీస వసతుల పనులను సమీక్షించి మాట్లాడారు. జిల్లాలో 532 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పనులు చేపట్టామని 350 పాఠశాలల్లో కనీస వసతులైన తాగునీరు, మైనర్ రిపేర్లు, మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ పనుల పూర్తయ్యాయన్నారు. మిగిలిన పాఠశాలల్లో వచ్చే 10 రోజుల్లో పనులు పూర్తి కావాలని ఆదేశించారు. నాణ్యమైన విద్యకోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో కె.నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

చిన్నారుల ఆరోగ్యానికి ఆల్బెండజోల్ మాత్రలు

వలిగొండ: ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యవంతంగా ఉంటారని కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. మండలకేంద్రంలో వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులను పంపిణీ చేసి మాట్లాడారు. 19 ఏళ్ల వయస్సుగల అందరూ ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తునట్లు తెలిపారు. విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. డిసెంబరు వరకు సిలబస్‌ను పూర్తి చేసుకుంటే అనంతరం మరోసారి రివిజన్ చేసుకునే అవకాశం ఉంటుందని, ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. సోషల్ మీడియాకు, టీవీ సీరియళ్లకు, మొబైల్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పాపారావు, డిప్యూటి డీఎంహెచ్‌వో యశోద, డీఐవో వంశీ, డాక్టర్ సుమన్‌కల్యాణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, మండల విద్యాధికారి స్వర్ణలత పాల్గొన్నారు.

వసతి గృహాల్లో గ్రేడ్-1 ఉద్యోగాలకు పరీక్ష

భువనగిరి అర్బన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో వసతి గృహాల్లో గ్రేడ్-1, 2 ఉద్యోగాల నియామకానికి పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఈ నెల 24 నుంచి 29 వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లాలోని భూదాన్ పోచంపల్లి మండలంలోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, నాలుగు విడతల్లో మొత్తం 408 అభ్యర్థులు హాజరవుతారని వివరించారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న మోదీ

● నీట్ పరీక్షపై సమగ్ర విచారణ జరిపించాలి
● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 20: ప్రధాని నరేంద్రమోదీ మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షపై సమగ్ర విచారణ జరిపించి పరీక్షలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చేపడుతున్న ఆందోళనకు సీపీఐ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ అహంకారంతో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించిన విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలను కలవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అవినీతిరహిత పాలన అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఏశాల అశోక్, చెక్క వెంకటేష్, ఎండీ ఇమ్రాన్, బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

చౌటుప్పల్ రూరల్, జూన్ 20: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి మళ్లీ పూర్వవైభవం తెస్తామని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. గురువారం చౌటుప్పల్ మండలంలో ఊరూరా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా అల్లాపురం, పీపల్‌పహాడ్, దేవలమ్మనాగారం, కొయ్యలగూడెం గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా చౌటుప్పల్ మండలంలో ఊరూరా టీడీపీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కుందారుపు కృష్ణమాచారి, మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య, నాయకులు వర్కాల వెంకటేశంగౌడ్, నల్ల పర్వతాలు యాదవ్, పాశం రఘుపతి, పోలోజు గోవందచారి, యాట వెంకటేశం, సుంకరి జంగయ్య గౌడ్ పాల్గొన్నారు.



అల్లాపురంలో జెండా ఎగురవేస్తున్న నర్సింహులు

టీజీ పీఈ-సెట్‌లో రాష్ట్ర మొదటి ర్యాంక్

● సత్తా చాటిన జిల్లా విద్యార్థిని సంధ్య



విద్యార్థిని సంధ్య

మోటకొండూరు, జూన్ 20: వ్యాయామ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీజీ పీఈసెట్)లో జిల్లా విద్యార్థిని రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీవరకు నిర్వహించిన టీజీ- పీఈసెట్ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం అమ్మనబోలుకు చెందిన చిట్టిమల్ల సంధ్య(హాల్‌టికెట్‌నెం. 50526) రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. తల్లిదండ్రులు రమేష్, మాధవి దంపతులు కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన సంధ్య గురువుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే ఆటలపై, చదువుపై ఆసక్తి చూపుతోంది. గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, ఆలేరులోని వెంకటరమణ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. గతంలో అండర్-14, అండర్-19 విభాగంలో ఫుట్‌బాల్, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో పలు పతకాలు సాధించినట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు గడసంతల మధుసూదన్ తెలిపారు. తమ కుమార్తెకు టీజీ పీఈసెట్‌లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేశారు.

త్రిబుల్ ఆర్ నిర్మాణానికి రైతులు సహకరించాలి

● చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి

వలిగొండ, జూన్ 20: రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిబుల్ ఆర్) నిర్మాణానికి రైతులు సహకరించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలకేంద్రంలోని రైతు వేదికలో గురువారం త్రిబుల్‌ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డి ప్యూటీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌శర్మ, ఎంఆర్‌ఐ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో బలవన్మరణం

దామరచర్ల, జూన్ 20: ఉరి వేసుకొని యువతి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండలకేంద్రంలో గురువారం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన దొడ్ల సురేష్ మండలంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో ఉద్యోగిగా పనిచేస్తూ దామరచర్లలో నివాసం ఉంటున్నాడు. అతనితోపాటు పాల్వంచకు చెందిన ప్రియాంక(34)తో సహజీవనం సాగిస్తున్నట్లు సమాచారం. ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రియాంక అద్దెకు ఉంటున్న ఇంట్లోనే చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన సురేష్ చున్నీని కత్తిరించి కిందికి దించి 108కు సమాచారం అందించాడు. అప్పటికే ప్రియాంక మృతిచెందినట్లు 108 సిబ్బంది గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. ప్రియాంక మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు భర్తగా చెప్పుకుంటున్న సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రియాంక బంధువులు దూరప్రాంతంలో ఉండడంతో వారు ఇక్కడికి వచ్చేందుకు సమయం పట్టనున్నట్లు తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

సారా విక్రయిస్తున్న వారిపై కేసు

కొండమల్లేపల్లి, జూన్ 20: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని ఆంగోతుతండాకు చెందిన వ్యక్తి ఐదు లీటర్ల సారాను కొండమల్లేపల్లికి తీసుకెళ్తుండగా పోలీసులు గురువారం పట్టుకున్నారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన సదరు వ్యక్తిని పట్టుకొని సారా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా దేవరకొండలో ఓ మహిళ నాలుగు లీటర్ల సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకొని సారా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

అందరికీ ఆరోగ్య యోగం

● యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ● మానసిక ఒత్తిడి అధిగమించడానికి మార్గం ● నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

చిట్యాల రూరల్, జూన్ 20: చిట్యాలలో రెండున్నర దశాబ్దాల క్రితం కొందరితో మొదలైన యోగా శిక్షణ నేడు అందరికీ ఆరోగ్య యోగం కల్పిస్తోంది. యోగా సాధనకు సాధకులకు కేంద్రం అవసరమవ్వగా స్థానికంగా వనిపాకల రోడ్డులో రుషీ సంస్కృతి యోగా సేవా కేంద్రం పేరిట సిద్ధ సమాధియోగా ధ్యాన మంది రాన్ని నాలుగేళ్ల క్రితం నిర్మించారు. అందులో గురూజీ యోగా సాధన, ప్రాణాయామం, ధ్యానంతో పాటుగా మేధాశక్తిపై సాధకులకు శిక్షణని స్తుంటారు. ధ్యాన మందిరంలో సాధకులు నిత్యం సాధన చేస్తుం టారు. మరో ప్రాంతంలో ఎస్‌బీఐ వెనుక భాగంలో పత్రిజీ ఆధ్వర్యంలో ఏడాది క్రితం శ్రీవారిజాల వేణుగోపాలస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేశారు. నిత్యం 15మంది పిరమిడ్ కేంద్రంలో ధ్యానం చేస్తుంటారు.



చిట్యాలలో యోగా శిక్షణ ఇస్తున్న బాపూజి గురూజీ





యోగాసనాలు చేస్తున్న డీఎస్పీ శ్రీలక్ష్మి(ఫైల్)



యోగాసనాల్లో దిట్ట డీఎస్పీ శ్రీలక్ష్మి

నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన డీఎస్పీ తుమ్మల శ్రీలక్ష్మి యోగాసనాలు వేస్తూ యోగాసన పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో బంగారు, కాంస్య పతకాలు సాధించారు. హైదరాబాద్‌లో 1996లో ఎస్ఐగా, సీఐగా పనిచేసి డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం అంబర్‌పేట్‌లోని పోలీస్ శిక్షణ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం తన ఫిట్‌నెస్ కోసం చేసిన యోగాలో శిక్షణ పొంది నిత్యం సాధన చేస్తుండేవారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో పాల్గొన్న శ్రీలక్ష్మి 2015, 2016, 2017, 2022, 2023, 2024లో కాంస్య, బంగారు పతకాలు సాధించారు. రాష్ట్రం తరుపున యోగాసనాల పోటీల్లో పాల్గొని జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి విజయాలు సొంతం చేసుకు న్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన డీఎస్పీ శ్రీలక్ష్మిని డీజీపీ రవిగుప్తా అభినందించారు.


యోగా శిక్షణతో ఆరోగ్య యోగం, ప్రాణశక్తి



ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా శిక్షణ, ఆరోగ్యపు అలవాట్లలో మార్పు తప్పనిసరి. యోగా చేయడం కష్టమేమీ కాదు.. సులువైన పద్ధతిలోనే ఉంటుంది. శిక్షణలో ప్రాణాయామం చేయ డంతో ప్రాణశక్తి లభిస్తుంది. శ్వాసను ఉచ్వాస నిచ్వాస ద్వారా శిక్షణ ప్రాణశక్తి వస్తుంది. యోగా ద్వారా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుం టే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. అంతేకాకుండా క్రమశిక్షణ కూడా అలవరమేకాకుండా మేధస్సును పెంపొందిస్తుంది.

● బాపూజి, యోగా గురూజీ, చిట్యాల

ధ్యానంతో మేధాశక్తి



ధ్యానం చేయడం ఎంతో ఉత్తమం. దాని ద్వారా మేధాశక్తిని పెంపొందించుకోవచ్చు. ధ్యానం చేయడం కష్టమైన పని తమ వల్ల కాదని అనుకోవద్దు. అందరికీ సాధ్యమైన పనే. ఒక ప్రాంతంలో కళ్లు మూసుకుని కూర్చుని శ్వాస మీద ధ్యాస పెట్టాలి. ధ్యానం చేస్తే మేధస్సును పెంపొందిచడంతో పాటు ఆరోగ్యం, మనస్సు స్థిమితం, ప్రశాంతంత కలుగు తుంది. నిత్యం ధ్యానం చేస్తూ రోజురోజుకు పెంచు కుంటే మెదడు శక్తివంతంగా మారుతుంది. .

● పున్న పాండు, యోగా శిక్షకుడు, చిట్యాల.





ఈ యోగా సిస్టర్స్ ప్రత్యేకం

నార్కట్‌పల్లి: అలవోకగా యోగాసనాలు వేస్తూ భళా అనిపించుకుంటున్నారు నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న అక్కా చెల్లెళ్లు దాసోజు సంజన, సౌమ్య. నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన దాసోజు నర్సింహ్మాచారి వృత్తిరీత్యా స్వర్ణకారుడు. ఆయన కరాటే, యోగాలో పలువురికి శిక్షణ ఇచ్చేవాడు. ఆ సమయంలో కాలక్షేపం కోసం తన ఇద్దరు కూతుళ్లను తాను శిక్షణ ఇచ్చే యోగసనాలు చూపిచ్చేందుకు తీసుకెళ్లేవాడు. వారు కూడా అలవోకగా యోగసనాలు వేస్తూ అబ్బురపరిచారు. పిల్లల్లో యోగాసనాల పట్ల ఉన్న ఆసక్తిని గమనించిన నర్సింహ్మాచారి తానే గురువై కరాటేతో పాటు, యోగాసనాలు వేయడంలో తర్ఫీదునిచ్చాడు. ఉదయం ఓ సారి, పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం వేళల్లో మరోసారి ఆసనాలు వేస్తూ అక్కా చెల్లెళ్లు ఇద్దరూ యోగాలో ప్రావీణ్యం సాధించారు. తండ్రి ప్రోత్సాహంతో పలు జిల్లా, రాష్ట్ర స్థాయి వేదికలపై యోగా, కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ప్రముఖుల నుంచి అవార్డులు అందుకున్నారు. సంజన పదో తరగతి పూర్తిచేయగా, సౌమ్య 10వ తరగతి చదువుతోంది.

యోగాలో సంజన, సౌమ్య ప్రశంసలు

- తక్కువ వయసులో ఎక్కువ ఆసనాలు వేసి తెలంగాణ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు
- 2015లో నకిరేకల్‌లో ఏపీఎం పాఠశాలలో షాటోకాన్ కరాటే పోటీల సందర్భంగా కఠినమైన యోగసనాలు వేసి ఎమ్మెల్యే వేముల వీరేశం నుంచి ప్రతిభా అవార్డులు అందుకున్నారు.
- 2016లో ఆర్యసమాజ్ మందిర్‌లో జాతీయ దినోత్సవం సందర్భంగా యోగాసనాలు ప్రదర్శించి నగదు బహుమతి పొందారు
- 2017లో నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన యోగా పోటీల్లో పాల్గొని అప్పటి కలెక్టర్ సత్యనారాయణరెడ్డి నుంచి అభినందనలు.
- 2017 అక్టోబరు 13 నుంచి 15వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగిన 63వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో సంజన బంగారు పతకం అందుకుంది.
- మాస్టర్లే ఆశ్చర్యపడేలా యోగాసనాలు వేసిన యోగా సిస్టర్స్ సంజన, సౌమ్యలను అప్పటి ఎస్పీ ఏవీ రంగనాథ్ అభినందించారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్య తిరుకల్యాణం

భువనగిరి అర్బన్, జూన్ 20: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు పాంచరాత్రాగమ రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్ట భుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి, ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి అర్చకస్వాములు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో సాంప్రదాయరీతిలో నిత్య పూజలు వైభవంగా జరిగాయి. కొండపైన శివాలయంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 26,14,890 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈ నెల 27న ఉదయం 7గంటలకు కొండకింద రెండో వ్రతమండపంలో లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.కొండకింద యాదగిరిపల్లిలోని లక్ష్మీహయగ్రీవ స్వామి ఆలయంలో ఈనెల 21నుంచి 26 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 23వ తేదీన ఎదుర్కోళ్ల ఉత్సవం, 24న కల్యాణోత్సవం, 25న రథోత్సవం, 26వ తేదీన జరిగే చక్రతీర్థం, మహాపూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు.



ప్రధానాలయంలో తిరుకల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

'పేట'లో ఎనిమిది కిలోల గంజాయి పట్టివేత

● బైక్‌పై తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

భానుపురి, జూన్ 20: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎనిమిది కిలోల గంజాయిని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ రవి కేసు వివరాలు వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలోని ఖమ్మంక్రాస్‌రోడ్డులో అమ్మగార్డెన్ సమీపంలోని రోడ్డుపై పట్టణ పోలీసులు ఉదయం ఏడు గంటల ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ముగ్గురిని ఆపి తనిఖీ చేశారు. చింతలచెర్వుకు చెందిన కోడిదల పవన్‌కుమార్, శ్రీరాంనగర్‌కు చెందిన మన్నె రాహుల్, సూర్యాపేటకు చెందిన మైనర్ బాలుడు ఉన్నారు. వీరిలో ఒకరి చేతిలో నలుపు, గులాబీ రంగు గల బ్యాగ్ లోపల నాలుగు గోధుమ రంగు టేప్‌తో చుట్టిన ప్యాకెట్లలో గంజాయి ఉంది. వీరిని విచారించగా పవన్, అబ్దుల్ రహీం కలిసి ఖమ్మం నుంచి ట్రైన్‌లో ఏపీ రాష్ట్రంలోని అరకు వెళ్లి అక్కడ గంజాయి రూ. 8వేల చొప్పున ఎనిమిది కిలోలు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి ఖమ్మం వచ్చారు. రాహుల్ తన బైక్‌పై ఖమ్మం వెళ్లి వారిని ఎక్కించుకుని సూర్యాపేటకు గంజాయి తీసుకొస్తుండగా పట్టుపడ్డారు. సూర్యాపేటలో కేజీ రూ.20నుంచి రూ.30వేల వరకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు నిందితులు తెలిపారని పేర్కొన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి జైలుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును చేధించిన పట్టణ సీఐ రాజశేఖర్, పట్టణ ఎస్ఐలు మహేంద్రనాథ్, కుశలవ, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కరుణాకర్, సైదులు, కానిస్టేబుళ్లు ఆనంద్, మధును ఏఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవి

కారులో వచ్చి మేకలు అపహరించి..

పెద్దఅడిశర్లపల్లి, జూన్20: నెంబర్ ప్లేటు లేని కారులో తిరుగుతున్న గుర్తుతెలియని వ్యక్తులు మేకలను అపహరిస్తున్నారు. ఇంటి వద్ద పాకలో కట్టేసిన మేకలను దొంగిలించడమే లక్ష్యం తిరుగుతున్నారు. నెలలో మోటర్ కేబుల్ దొంగతనం మరువకముందే బుధవారం రాత్రి కారులో వచ్చిన దొంగలు గుడిపల్లి మండలంలోని రాయినిపాలెం గ్రామానికి చెందిన శాస్త్రీ సుందరయ్య అనే వ్యక్తి మేకల మందపై పడి నాలుగు మేకలను కారులో వేసుకొని పరారయ్యారు. వీటి విలువ సుమారు రూ. 60 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. అదేవిధంగా పీఏపల్లి మండలం మేకలవారిగూడెం చెందిన నారబోయిన మల్లయ్యకు చెందిన మేకల మంద నుంచి మేకను దొంగిలించి కారులో ఎక్కించుకుని పోతుండగా కారు అడ్డగించడంతో రీవర్స్ తీసుకుని పారిపోయారని బాధితుడు తెలిపాడు. దీని విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు

ఆరోపణలపై విచారణ

మర్రిగూడ, జూన్ 20: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు అధికారి వెంకటేష్‌పై డీఆర్‌డీవో అదనపు పీడీ నవీన్‌కుమార్ గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఏపీవో ఫీల్డ్ అసిస్టెంట్‌లను వేధింపులకు గురిచేస్తూ ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపాలని బెదిరింపులకు గురిచేస్తున ఆరోపణలపై, అదేవిధంగా ఏపీవో వెంకటేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు సక్రమంగా విధులు నిర్వహిస్తా లేరంటూ ఎంపీడీవో మున్నయ్యకు ఫిర్యాదు చేశారు. మే 21న చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులకు తెలిపారు. ఫిర్యాదులపై అదనపు పీడీ విచారణ నిర్వహించారు. జిల్లా పీడీకి నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఆయనవెంట దేవరకొండ ఉపాధిహామీ క్లస్టర్ అధికారి బాలకృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ప్రాణం కాపాడిన బ్లూకోట్స్ సిబ్బంది

● గుండెనొప్పితో బాధపడుతున్న లారీ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలింపు

● సకాలంలో తీసుకెళ్లడంతో దక్కిన ప్రాణం

చౌటుప్పల్ రూరల్, జూన్ 20: గుండెనొప్పితో బాధపడుతున్న లారీ డ్రైవర్‌ను బ్లూకోట్స్ సిబ్బంది సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఈ సంఘటన జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన వెంకటరమణ(53)కు సొంత లారీ ఉంది. కుమారుడు అర్జున్‌కుమార్‌తో బుధవారం మధ్యాహ్నం లోడ్ లారీతో హైదరాబాద్‌కు బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి చిట్యాల వద్దకు రాగానే వాహనం నడుపుతున్న వెంకటరమణకు గుండెనొప్పి వచ్చింది. దీంతో 25కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌటుప్పల్ వరకు కుమారుడు అర్జున్‌కుమార్ వాహనం నడిపాడు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తంగడపల్లి చౌరస్తా వద్ద నిలిపి పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోట్స్ పోలీసులు నాగరాజు, వెంకటేశంకు విషయం చెప్పాడు. వారు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి సమాచారం ఇచ్చారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంకటరమణను తమ వాహనంపై ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి వెంకటరమణ పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అంబులెన్స్‌ను రప్పించి హైదరాబాద్‌కు పంపించారు. అక్కడి వైద్యులు వెంకటరమణకు మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. సకాలంలో ఆస్పత్రికి తరలించి వెంకటరమణ ప్రాణాలు కాపాడిన బ్లూకోట్స్ సిబ్బందిని సీఐ ఆశోక్‌రెడ్డి అభినందించారు.



చికిత్స పొందుతున్న వెంకటరమణ

కాల్వలో చెత్తా చెదారం తొలగింపు



అనంతారంలో మురికి కాల్వను శుభ్రం చేస్తున్నపంచాయతీ సిబ్బంది

భువనగిరి రూరల్, జూన్ 20: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని గురువారం 'ఆంధ్రజ్యోతి' మినీలో ప్రచురితమైన 'పారిశుధ్య చర్యలేవి.?' కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. గురువారం ఉదయం మండలంలోని అనంతారం గ్రామ శివారులోని చెత్తా చెదారం, పేరుకుపోయిన మురికి కాల్వను ఎంపీడీవో సీహెచ్.శ్రీనివాసరావు పరిశీలించి, వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బందితో చెత్తా చెదారాన్ని తొలగింపజేశారు. బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ జి.నర్సింగ్‌రావు ఉన్నారు.

30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

మోత్కూరు, జూన్ 20: మోత్కూరు మండల కేంద్రంలో 30పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. ఈమేరకు గురువారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాలకు కూడలి కేంద్రమైన మోత్కూరులో పెద్ద ప్రభుత్వ ఆస్పత్రి లేక ప్రజలు చికిత్స కోసం 50 నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని ఆయన మంత్రికి వివరించారు. పోస్టుమార్టం సౌకర్యం కూడా అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే సామేల్ తెలిపారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు భార్గవ్

చౌటుప్పల్ టౌన్, జూన్ 20: చౌటుప్పల్ ప్రాంతంలో ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని ఎన్ఎస్‌యూఐ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ డిమాండ్‌చేశారు. స్థానిక రాజీవ్ భవన్‌లో గురువారం ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, కనీసం జాతీయ గీతాన్ని ఆలపించడానికి కూడా స్థలం లేదని ఆయన అన్నారు. ఫీజుల వసూళ్లకు అడ్డూ, అదుపూ లేకుండా పోయిందని, పిల్లలకు ఫీజులు చెల్లించలేక తల్లిదండ్రులు బావురుమంటున్నారని ఆయన తెలిపారు. విద్యాసంస్థల్లోనే పుస్తకాలను విక్రయిస్తూ విద్యార్థులను దోపిడీ చేస్తున్నారని, బహిరంగ మార్కెట్‌లో రూ. 2000-00 లకు లభించే పుస్తకాలను విద్యాసంస్థలలో రూ. 6,000-00 లకు విక్రయిస్తున్నారని ఆయన వివరించారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సాగిస్తున్న అక్రమ దందాపై అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు బోయ నవీన్, ఎర్ర శ్రీధర్, ఎర్ర శ్రవణ్, ముజాహిద్, అజయ్, సాయి కుమార్, మధు, శివ పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించాలి



మల్లేపల్లిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

వలిగొండ, జూన్ 20: మల్లేపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సిరిపంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్లేపల్లిలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తూ వెల్వర్తి, మొగలిపాక గ్రామాల ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. వెంటనే డ్రైనేజీని నిర్మించి బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గర్దాసు నర్సింహ, నాయకులు లక్ష్మయ్య, సత్తయ్య, షాహిద్, బిక్షపతి పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



రామన్నపేట: ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీచేస్తున్న ఎంపీపీ బాలమణి

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: నులిపురుగుల నివారణ దినాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. భువనగిరి మండలం బస్వాపురంలో ఎంపీపీ నరాల నిర్మల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ యామిని, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు లింగయ్య, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఉన్నారు.

● మోటకొండూర్ మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 3060 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి విజయ్ కుమార్, తహసీల్దార్ శాంతిలాల్ తెలిపారు. కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు జయంత్, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు భైరెడ్డి ప్రభకర్ రెడ్డి, నర్సయ్య, కృష్ణరెడ్డి, సుగుణ, ధనమ్మ, కవిత, మమత పాల్గొన్నారు.

●భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని పీహెచ్‌సీ కేంద్రంలో, పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి, సూపర్‌వైజర్ అరుంధతి, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్‌బాబు, లత, ఆవా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఆలేరు మండలంలో 7836 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామని శారాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. మిగతా పిల్లలకు ఈ నెల 25లోగా మాత్రలు పంపిణీ చేస్తామన్నారు.

● రామన్నపేట మండలంలో ఎంపీపీ పూస బాలమణిబాలనర్సయ్య తుమ్మలగూడెం, రామన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 19 ఏళ్లలోపు విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

● మోత్కూరు మండలంలో కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్, మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కౌన్సిలర్ పురుగుల వెంకన్న, డాక్టర్ అమరావతి, హెచ్ఎం టిగోపాల్‌రెడ్డి, సీహెచ్‌వో దేవకి పాల్గొన్నారు.

● రాజాపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆల్బెండజోల్ మాత్రలను తహసీల్దార్ దామోదర్, ఎంపీపీ బాలమణి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సుప్రియ, ఎంపీటీసీ రాజు పాల్గొన్నారు.

అడుగంటిన లక్కారం చెరువు



చుక్క నీరు కనిపించని లక్కారం చెరువు


● *తీవ్రంగా మారిన సాగునీటి సమస్య*

చౌటుప్పల్ టౌన్, జూన్ 20: చౌటుప్పల్ ప్రాంతంలో లక్కారం పెద్ద చెరువులోకి నీటి చుక్క చేరకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలలో సాగు నీటి సమస్య తీవ్రంగా నెలకొంది. గత రెండు సంవత్సరాలుగా నెలకొన్న అనావృష్టి పరిస్థితులతో చెరువులోకి చుక్క నీరు చేరలేదు. దీంతో వ్యవసాయ బావులు, బోర్లలో నీటి మట్టం పడిపోవడంతో వరి సాగును రైతులు తగ్గించారు. 2024 యాసంగిలో ఈ చెరువు కు చుట్టు పక్కల గ్రామాలైన ధర్మోజిగూడెం, లక్కారం, చౌటుప్పల్ తదితర గ్రామాలలో సాగునీటితో పాటు తాగు నీటి సమస్య నెలకొంది. ఈ వానాకాలంలో సైతం వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో రైతులు వరి సాగును గణనీయంగా నిలిపివేశారు. వర్షాలు కురిసి చెరువులోకి నీరు చేరుతుందన్న ఆశతో ఉన్న రైతులకు నిరాశే కనిపిస్తోంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన లక్కారం పెద్ద చెరువులోకి రెండు సంవత్సరాలుగా వర్షం నీరు చేరక పోవడంతో సంవత్సరం నుంచి చుక్క కూడా లేని పరిస్థితి ఏర్పడింది. చేపలవేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులు జీవనోపాధి కరువై కూలీ పనులకు వెళుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి.

మాధవరెడ్డి హయాంలో వరద కాలువ

చెరువులోకి వరద కాలువను 1998లో దివంగత పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎలిమినేటి మాధవ రెడ్డి నిర్మాణం చేయించారు. మండల పరిధిలోని దండు మల్కాపురం పైభాగంలోని తెప్పల చెరువు నుంచి లక్కారం చెరువు వరకు రూ. 32లక్షలను వెచ్చించి రెండున్నర కిలోమీటర్ల పొడవును వరద కాలువను నిర్మించారు. దీంతో కైరతాపురం, లక్కారం, చౌటుప్పల్ చెరువుల్లోకి వరద నీరు చేరి, అలుగు పోశాయి. అప్పటి నుంచి ఈ చెరువులు తరచూ నిండుతున్నాయి. కొంత కాలం నుంచి నెలకొంటున్న వర్షాబావ పరిస్థితులతో వరద కాలువ నుంచి వర్షపు నీరు రాక పోవడంతో చెరువులు ఎండి పోయి సాగు నీటి కొరత ఏర్పడింది.

మూసీ జలాలను మళ్లించాలి



లక్కారం చెరువులోకి పిలాయిపల్లి కాలువ ద్వారా మూసీ జలాలను మళ్లించి సాగునీటి సమస్యను పరిష్కరించాలి. చిన్నకొండూరు గ్రామం సమీపం నుంచి వెళుతున్న కాలువ నుంచి మూసీ జలాలను మళ్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. భూగర్భ జలాల మట్టం పెరిగి, వ్యవసాయ రంగానికి సాగు నీరు లభిస్తుంది. చెరువులోకి జలాలను మళ్లించాలని దశాబ్దాల నుంచి పోరాటాలను సాగిస్తున్నాం. ఈ సమస్యను పరిష్కరించేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

-కొంతం బుచ్చిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్, ధర్మోజీగూడెం, చౌటుప్పల్ మండలం

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ, జూన్ 20: రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందనిచ రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎదులగూడెం గ్రామ పరిధిలో వెంకటేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులు, మోటార్ల పంపు సెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌తో బీడు భూములు సాగులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాలువల పునరుద్ధరణకోసం సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఉమ బాలనర్సింహ, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భారతమ్మ జాన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కంకల కిష్టయ్య, మాజీ ఎంపీపీ బడుగు సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, నాయకులు వాకటి అనంతరెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ: గ్రామల అభివృద్ధికి దీవిస్ సంస్థ చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎదులగూడెం గ్రామంలో దీవిస్ లెబరేటరీ లిమిటెడ్ సౌజన్యంలో రూ.5.36లక్షల విలువల గల ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంటును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకలు అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, దీవిస్ అధికారి సాయికృష్ణ పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

● *బాధిత విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలి*

● *సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్*



భువనగిరిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భువనగిరి రూరల్/ వలిగొండ, జూన్ 20: నీట్ పేపర్ లీకేజీతో విచారణ జరిపించాలని అదేవిధంగా ప్రధాని మోదీ బాధ్యత వహించి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తా వద్ద ప్లకార్డుతో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుజరాత్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ అంశాలు ముందుకు వచ్చాయని వాటిపై విచారణ జరపకుండా కేవలం గ్రేస్ మార్కులు మాత్రమే రద్దుచేసి పెట్టడం అంటే నీట్ అవకతవకల పక్కనపెట్టి విస్మరించడం అవుతుందని ఎన్టీఏలో రద్దుచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర జిల్లా నాయకులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, దాసరి పాండు, మాయ కృష్ణ, దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేష్, మల్లేష్, ఎల్లయ్య అశోక్, అంజయ్య, భాగ్య ఉన్నారు.

వలిగొండ: నీట్ పరీక్ష పత్రాల లీకేజీపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గదర్శి సభ్యులు మాటూరి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిరిపంగి స్వామి, మండల కార్యవర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్, మెరుగు వెంకటేశం, నాయకులు నర్సింహ, స్వామి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించేవారిపై చర్యలేవీ?



ఎంఈవోతో వాగ్వాదానికి దిగిన విద్యార్థి నేతలు

భువనగిరి రూరల్, జూన్ 20: అక్రమంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టులు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. గురువారం వారు పలు పాఠశాలల వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య హైస్కూల్‌లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అధిక ధరలకు పాఠ్య, నోట్ పుస్తకాలు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకోగా విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆయనతో వాగ్వాదానికి దిగారు. స్టేషనరీ, యూనిఫాం, టై, బెల్ట్‌లను స్వాధీనం చేసుకొని ప్రాథమిక పాఠశాలలో భద్రపరిచినట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రైవేటు పాఠశాల సీజ్

మోత్కూరు : మోత్కూరు మండల కేంద్రంలో విద్యాశాఖ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య ప్రైవేటు పాఠశాలను డీఈవో ఆదేశాల మేరకు గురువారం సీజ్ చేశారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో శ్రీధర్, నోడల్ ఆఫీసర్ టిగోపాల్‌రెడ్డితో కలిసి గురువారం శ్రీచైతన్య పాఠశాలకు వెళ్లారు. అనుమతులు లేకుండా పాఠశాలలో తరగతులు నిర్వహిస్తుండటంతో వారు విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల నుంచి బయటకు పంపి, పాఠశాల కార్యాలయాన్ని సీజ్ చేశారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలలో అడ్మిషన్లు తీసుకోవడం, ఫీజులు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని, చట్టరీత్యా యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎంఈవో శ్రీధర్ తెలిపారు.

సంక్షిప్తంగా..

రామన్నపేట : ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నెహర్ పలు కాల్వలపై ఉన్న వంతెనలపై రక్షణ గోడలు నిర్మించాలని టీడీపీ నాయకులు కోరారు. గురువారం మండలంలోని సిరిపురం-వెలిమినేడు రోడ్డుపై వంతెనను పలువురు నాయకులు, రైతులు పరిశీలించారు. నాయకులు రాపోలు నర్సింహ, గోశిక చక్రపాటి, పున్న వెంకటేశం, సాయని శేఖర్, గాదె జానీ, గంజి వీరయ్య, కొంపల్లి వీరేశం, యాదయ్య పాల్గొన్నారు.

ఆలేరు రూరల్: రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి చిరబోయిన రాజయ్య, బేజాడి కుమార్‌లు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. నాయకులు బాబు, గోపాల్‌రెడ్డి, కొమురయ్య, కుమార్, వెంకటేష్, నర్సింహారెడ్డి, సుజాత ఉన్నారు.

ఆలేరు రూరల్: విద్యార్థులు మత్తు పానీయాలకు, డ్రగ్స్‌కు బానిస కావొద్దని ఆలేరు ఎస్ఐ వెంకటశ్రీను అన్నారు. స్థానిక బీసీ హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చెడు స్నేహం చేయరాదని అన్నారు.

భువనగిరి రూరల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జానారెడ్డిని ఆయన నివాసంలో కలిసి పూలమాలతో సన్మానించారు. అనంతరం భువనగిరిలో వృద్ధులకు, పేదలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు మొలుగు లక్ష్మయ్య, పిట్టల బాలరాజ్, మహమ్మద్ జలీల్, గుమిడెల్లి రమేష్ ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గుత్తా ఉమాదేవి, జడ్పీటీసీ వీరమల్ల భానుమతి కోరారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 37మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీటీసీలు బచ్చనగోని గాలయ్య, ఈసం యాదయ్య, మర్రి వసంత, తహసీల్దార్ కృష్ణ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాత్క శేఖర్ కోరారు. సంస్థాన్ నారాయణపురం మండలంలోని అల్లందేవి చెరువు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాత్క శేఖర్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వకుల, గుండు రాజు,బి. ఉపేందర్, గాలయ్య, నర్సింహ, జంగయ్య, భగవంత్ పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలని బీసీ సంక్షేమసంఘం యువజన విభాగం మునుగోడు నియోజకవర్గం అధ్యక్షులు వీరమల్ల కార్తీక్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించాలని కోరారు.

భూదాన్‌పోచంపల్లి: మండల పరిధిలోని పిలాయిపల్లి గ్రామంలోని పలు ఫ్యాక్టరీలతోపాటు రైస్ ఇండస్ట్రీస్ నుంచి వెలువడే కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని శుక్రవారం గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కుతాటి నవీన్, కొడిసెల వెంకటేష్, కొమ్మన భాను, రంగ భాస్కర్, కొల్లూరి శివుడు, బందారపు రమేష్, కంజర్ల గణేష్, మహేందర్, కొమ్మగోని శివాజీ, అందెల రాజు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : దుకాణాల్లో ఎరువులు, విత్తనాల, నిల్వలు వాటికి సంబంధించిన ధరలను స్టాక్ బోర్డుపైన ఖచ్చితంగా నమోదు చేయాలని ఆలేరు ఏడీఏ వెంకటేశ్వర్‌రావు డీలర్లను ఆదేశించారు. మండలంలోని లింగరాజ్‌పల్లి ,మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం,తోపాటు పలు ఎరువుల డీలర్ల దుకాణాలను గురువారం ఏడీఏ తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాలలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని, ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు.

గిరిప్రదక్షిణ దారికి విద్యుద్దీప శోభ



విద్యుద్దీపాల కాంతుల్లో గిరిప్రదక్షిణ దారి

భువనగిరి అర్బన్, జూన్ 20: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కొండచుట్టూ అధికారులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ప్రతీనెల స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం ఇక్కడ ఆనవాయితీ, వేకువ జాము నుంచే గిరిప్రదక్షిణ సాగుతున్నందున సుమారు రెండున్నర కిలో మీటర్ల మేర వైటీడీఏ ఆధ్వర్యంలో రోడ్డును నిర్మించారు. కాగా మరమ్మతులు చేపట్టిన రోడ్డును ఈ నెల 18న జరిగిన గిరిప్రదక్షిణ నాటికి పూర్తి చేయగా, విద్యుత్ దీపాలను ఇటీవల ప్రారంభించారు. రోడ్డు మార్గం పూర్తిగా అందుబాటులోకి వచ్చినందుకు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పోచంపల్లి అర్బన్ బ్యాంకు ఎన్నికలు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 20 : ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలు వరకు స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ నందు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి జి శ్రీనివాస్ తెలిపారు. 2301 మంది సభ్యులు ఉన్న ఈ బ్యాంకు ఎన్నికల ప్రక్రియకు అందరూ సహకరించాల్సిందిగా ఆయన కోరారు. ఎస్సీ/ఎస్టీ కేటగిరి 1 డైరెక్టర్ స్థానానికి ఇద్దరు అభ్యర్థులు, మహిళా కేటగిరి 2 డైరెక్టర్ల స్థానాలకు ముగ్గురు అభ్యర్థులు, 6 జనరల్ కేటగిరి డైరెక్టర్ల స్థానాలకు గాను 22 మంది అభ్యర్థులు చొప్పున మొత్తం 27 మంది ఎన్నికల బరిలోకి దిగారు. ఈనెల 11 నుండి ఆరంభమైన నామినేషన్ల ప్రక్రియ నుండి శుక్రవారం నాటికి ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 7 బ్రాంచ్‌లుగా ఉండగా ఇటీవల 10 బ్రాంచ్‌లకు ఎదగింది, మరో నాలుగు బ్రాంచ్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని అందుకు ఆర్‌బీఐ అనుమతి లభించిందని సీఈవో సీత శ్రీనివాస్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందిగా ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ కోరారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు పోలింగ్ నిర్వహించిన అనంతరం ఓట్ల లెక్కింపు చేపడుతామని అదేరోజున ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

సాధారణ ఎన్నికలకు దీటుగా ప్రచారం

బ్యాంకు చైర్మన్‌గా కర్నాటి వెంకట బాలసుబ్రహ్మణ్యం వ్యవహరిస్తుండగా, పాలక వర్గం గడువు ఈ ఏడాది మే 19వ తేదీతో ముగిసింది. ఎంపీ ఎన్నికల కోడ్ కారణంగా ఎన్నికలు నిర్వహించలేదు. కాగా చైర్మన్ స్థానానికి పోటీకి దిగిన తడక రమేష్, కర్నాటి వెంకట బాలసుబ్రహ్మణ్యం పోటాపోటీగా ప్యానల్ ఏర్పాటు చేసుకుని తమ అభ్యర్థులతో కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ప్రసన్నం చేసుకుని ఓటును అభ్యర్థించారు. సాధారణ ఎన్నికలకు దీటుగా ప్రచారం నిర్వహించారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ప్రధాన వీధుల్లో పోస్టర్లు, ఫ్లెక్సీలు భారీగా ఏర్పాటుచేశారు. ఎలాగైనా తమ ప్యానల్ గెలవాలనే లక్ష్యంతో ఇరు వర్గాలు హోరాహోరీగా ప్రచారం సాగిస్తున్నారు. సోషల్ మీడియాలో, ఎస్ఎంఎస్‌లతోపాటు, వాయిస్ రికార్డులతో ప్రచారం హోరెత్తించారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గంలో ప్రాధాన్యం ఇవ్వాలి



చౌటుప్పల్ టౌన్, జూన్ 20: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని దేవదేవుడు వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. గురువారం మెట్ల మార్గంలో కాలినడకన తిరుమలకు చేరుకున్న చైర్మన్ రాజు- సంధ్యారాణి దంపతులు దేవదేవుడిని దర్శించుకున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత



యోగా సాదన చేస్తున్న మహిళలు

చౌటుప్పల్ టౌన్, జూన్ 20: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు పాలకుర్ల పాండు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని సర్వేజనా సుఖినోభవంతు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం చౌటుప్పల్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో మహిళలు యోగాసనాలు వేశారు. యోగాను దిన చర్యలో ఒక బాగం చేసుకుంటామని మహిళలు అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీలత, కాలనీ మహిళ సంఘం ప్రతినిదులు ధనలక్ష్మి, నీరజ, రజిత, మమత, కల్పన, వెంకటమ్మ, పద్మ లు పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు పాండు ను మహిళలు సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

కుళ్లిన వ్యక్తి మృతదేహం లభ్యం

బొమ్మలరామారం, జూన్ 20: బొమ్మలరామారం మండలం పెద్దపర్వతాపురం గ్రామ శివారులో చింతలకుంట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించడంతో గురువారం గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యక్తి వయస్సు సుమారు 40-50 సంవత్సరాల వరకు ఉంటుందని, పెసర రంగు టీ షర్ట్, నైట్ పాయింట్‌తో ఉన్నాడని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

భువనగిరి రూరల్, జూన్ 20: వి మండలంలోని అనంతారం గ్రామ పంచాయతీ పరిధిలోని బంజరుకోల్ బావి వద్ద విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత పడింది. రైతు సోమన అయిలయ్య పాడి గేదె మేతకు వెళ్లి సమీపంలోని విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.1లక్షల విలువగల పాడి గేదె మృతి చెందడంతో బాధిత రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. ట్రాన్స్‌కో అధికారులు విచారణ చేపట్టి బాధిత రైతుకు నష్టపరిహారం అందజేసే విధంగా చూడాలని సీపీఐ రాష్ట్ర నాయకులు ఏశాల అశోక్ డిమాండ్ చేశారు.